# యజుర్వేదములు

వేదము నాలుగు భాగములు. నాలుగును మించి ఉండుటకు వీలు లేదు. ఎందుకనగా, వేదము మనలను గురించి. మనము ఆలోచించినచో, నాలుగు భాగములు. మొదటి భాగము, మనకు లేని దానిని, కావలసిన దానిని కోరుట. మన కోరికలు అనంతము. వానిని తెలియపరచు విధానములు గూడ అనంతములు. పుట్టిననాడే ఆకలితో పాల కొరకు అరచుట నారంభింతుము. పెరిగిన కొలది వాంఛలు పెరుగుచునే యుండును. ధనవాంఛ, ఆరోగ్య వాంఛ, కీర్తి వాంఛ, దీర్ఘాయుర్వాంఛ, నిత్య జీవితమునందలి మన మాటలలో నివియన్నియు తెలియుచునే యుండును. రెండవ భాగము, మన కోరికలు తీరుటకు ప్రయత్నించుట. మన జీవితము ఆరంభమునుండి, అంతము వరకు ఈ ప్రయత్నమే ప్రయత్నము. మూడవ భాగము ఆ చేసిన ప్రయత్నముల ఫలితము నుభవించుట. ఈ మూడు భాగములు అర్థమ గుటకు ఉదాహరణముల నీయనవసరము లేదు. ఇది మనజీవన విధానము. జీవిత స్వరూపము. ఇక మనదైన నాలుగవ భాగము చమత్కారమయినది. ఉన్నదా, లేదా! అని అనిపించునట్టిది. మనము చేయు వందల పనులలో ఏ ఒక్క పని యందైనా దానిని గూర్చి ఆలోచింతుమో లేదో మనము చెప్ప లేనిది. మనమూహింపలేనిది జరిగినప్పుడు, మన ప్రయో జకమును మించినది జరిగినప్పుడు, అసంభవము అనుకొనినది సంభవమైనపుడు అది యెట్లు జరిగినది? అని ఇతరుల నడిగినపుడు "లోనున్న పరమాత్మ కెరుక" అందుము. తగిన కారణము చెప్పలేని వేళ, లో నున్న పరమాత్మను బయ టకు తెచ్చుట మానవులందరు చేయు పని. సృష్టి పుట్టిన దగ్గరనుండి, మానవులందరకు, తనను పుట్టించిన దేదియో ఒక శక్తి తనలో నెక్కడో దాగియున్నదనిన భావము లీలగా నుండును. కొందరు ఈ శక్తిని ప్రధానముగా భావించి, దాని విషయమాలోచింతురు. ఎక్కువ మంది కష్టకాలమునగాని స్మరింపరు. ఈ శక్తియే తక్కిన ప్రాణులందేగాక, ఈ బ్రహ్మాండమంతయు నిండి ఉన్నదన్న భావము గూడ మానవుల ఊహలోని భాగమే. వేద మీ శక్తిని బ్రహ్మమనుచు న్నది. ఈ శక్తి మనయందును, సృష్టియందంటను వ్యాపించి ఉండుటయే కాక, సృష్టి కారణము గూడ నదియే అని వేదము చెప్పుచున్నది.ఎదము మనలను గూర్చి చెప్పుచున్నదనగా,మన నాలుగు భాగములను (బ్రహ్మభాగముతోడ) విపులముగా, చెప్పుచున్నదని యర్థము. క్రమముగా ఆ నాలుగు భాగముల పేర్లు, ఋగ్వేదము, యజుర్వేదము, సామ వేదము, అథర్వణ వేదము.

వేదమీ నాలుగు భాగములలో మానవుని గూర్చి,మానవుని యందును,తక్కిన సకల సృష్టియందున్న బ్రహ్మమును గూర్చియును నిస్సంశయముగా, సంపుర్ణముగా చెప్పినది గాన, ఐదవ భాగమనవసరము. అందువలన లేదు.

కాని యజుర్వేదములు రెండు. తక్కిన వేదభాగములు ఒక్కొక్క స్వరూపమే. యజుర్వేదము మాత్రము శుక్ల యజు ర్వేదము, కృష్ణ యజుర్వేదమని రెండు స్వరూపములు. యజుర్వేదము పుట్టినపుడే రెండు స్వరూపములతో వెలికి వచ్చి యుండవలెను. ఎందుకనగా, అనాది కాలమునుండి, ఈ రెండే స్వరూపములున్నట్లు తెలియుచున్నది. 5000 సంవ త్సరముల క్రిందట వ్యాసమహర్షి నాలుగు శాఖలను వేరుచేసి, అధ్యయన పరులను గురుశిష్య పరంపరగా నిర్ణయించిన

కాలమునకే ఈ రెండు రూపములున్నవి. కనుకనే, ఋగ్వేదీయులు, సామవేదీయులు, అథర్వణ వేదీయులతో పాటు, శుక్ల యజుర్వేదీయులు, కృష్ణ యజుర్వేదీయులు, వ్యాసముని కాలమునుండి నేటి వరకు పరంపరగా వచ్చుచున్నారు.

యజుర్వేదము మానవయత్నము, అనగా యజ్ఞమును గురించి కావున రెండు యజుర్వేదములు యజ్ఞములనే వివరించును. ప్రస్తుతము కృష్ణ యజుర్వేదము ఆంధ్ర దేశమునందు, తమిళ దేశమునందును ప్రచారములో నున్నది. శుక్ల యజుర్వేదము ఉత్తర హిందుస్థానములో ప్రత్యేకముగా గుజరాతు నందు ప్రచారమందున్నది. గుజరాతీయులు వేదము నందలి యజ్ఞములనన్నియు శుక్ల యజుర్వేద మంత్రములతో సేయుచున్నారు. దక్షిణ దేశమున కృష్ణ యజుర్వేద మంత్ర ములతో సేయుచున్నారు. దక్షిణ దేశమున కృష్ణ యజుర్వేద మంత్రములతోడ.

యజుర్వేదమునందలి మొదటి మన్త్రము మనము జీవితమంతయు సంపాదించుటకు ప్రయత్నము సేయు ఇష, ఊర్జ లను గురించి. ఇష యనగా, అన్నము, ప్రాణమును నిలుపుటకు కావలసినవి. ఊర్జ అనగా బలము, ప్రాణమునకు కావ లసిన బలము. ప్రాణము ఉండి ప్రయోజనము లేదు. దానికి తగినంత బలము, ఉత్సాహము కూడ ఉండవలెను. ప్రాణమ ునకు అవసరమైన బలోత్సాహముల పేర్లు ఊర్జ లేక ఊర్జము. జీవితమునందు మనము సేయు పనులన్నియును ఈ రెండింటి కొరకే అను విషయము ఆలోచించినచో ఎవరికి వారికి అవగతమగును. అన్నమనగా వట్టి అన్నమే కాదు. ప్రాణమును నిలబెట్టునది అంతయును అన్నము; ఇష. బలమనగా వట్టి కండపుష్టియే కాదు. జీవితములో మనము మన వ్యక్తిత్వమును ప్రకటింపజేయుటకు కావలసిన సామాగ్రి అంతయును బలమే. గుండె నిబ్బరముతో మనమనుకొనిన పనులను జేయుటకు సంపాదించిన కీర్తి, ధనము, పరుపు, మర్యాదలన్నియును ఊర్జమే. వీటిని సంపాదించు వేళ మనకు, మన శక్తిని మించిన అనేకమయిన పరిస్థితులు సహాయపడును. దానిని వేదము దేవతాశక్తి అనును. మన ప్రయత్నము, అనగా మానవ శక్తి కొంత, దేవతాశక్తి కొంత కలిసి మన అన్న ప్రాప్తికి, బల ప్రాప్తికి కారణమైనవి. కనుక మనము సంపాదించి దానియందు మన భాగము, దేవ భాగముకూడా ఉన్నది. వేదము మనము చేయు ప్రతి ప్రయత్న మునందును, కర్మ యందును ఈ దేవభాగమును గుర్తుంచుకొనుమనుచున్నది. అప్పుడు ఆ కర్మ శ్రేష్ఠమయిన కర్మ. అనగా యజ్ఞము.

వేదమెప్పుడును తాను చెప్పదలచుకొన్న విషయమును మొదటనే చెప్పి తరువాత వివరించును. కనుకనే యజుర్వే దము ఇష, ఊర్జలతో ప్రారంభమయినది. వాటి సంపాదనా యత్నమునందు ఉత్తమమయిన విధానము మొదటనే చెప్పి నది.

ప్రథమ మన్త్రములయందే యజ్ఞ ప్రయోజనము, యజ్ఞస్వరూపము[1] తెలియజెప్పిన యజ్ఞవేదము, కృష్ణ-శుక్ల రూప ములతో రెండుగా ఎందు కవతరించినదో చెప్పకుండా ఉండునా? కృష్ణ యజుర్వేద మంత్రము దేవ భాగమును పెంపొందింపుము అని, శుక్ల యజుర్వేద మంత్రముఇంద్ర భాగమును వృద్ధి సేయుమనుచున్నది. కృష్ణ యజుర్వేద మన్త్ర మునందున్న దేవ భాగమునకు రెండర్థములు చెప్పవచ్చును. మానవాతీతమయిన దేవతాశక్తికీయవలసిన భాగము

రెండవది. దేవతలలో శ్రేష్ఠమయిన ఇన్ద్రశక్తి భాగమని కూడ చెప్పవచ్చును. శుక్ల యజుర్వేదము దేవభాగము అనక, ఇన్ద్ర భాగమనుచున్నది. ఇన్ద్ర దేవతాశక్తి ఇన్ద్రియముల మీద ప్రభావమున్న శక్తి. అనగా మన ఇన్ద్రియములను దేవభావము వైపునకు లేక, బ్రహ్మభావము వంకకు త్రిప్పగలిగిన శక్తి. ఇన్ద్రియములందు మనస్సు ప్రధానమయినది కదా! అచ్చట వాడిన ఇన్ద్ర శబ్దము చేత శుక్లయజుర్వేద మన్త్రములు మానసిక యజ్ఞమునకు గూడ అనువైనవని వేదము స్ఫురింపజేయుచున్నది .

మనము సేయు కర్మలు రెండు విధములు. ఒకటి మనసు తోటి ఆలోచన చేయుచు, భౌతిక శరీరముతోడ పనిచేయుట. ఇచ్చట స్థూల శరీరమును, సూక్ష్మ శరీరమును రెండింటిని ఉపయోగించుచున్నాము. రెండవ విధమైన కర్మయందు భౌతిక శరీరమునుపయోగించుట లేదు. మనస్సుతో మాత్రమాలోచించి నిర్ణయమునకు వచ్చు, ధ్యానము, తపస్సు, ఇవి సూక్ష్మ శరీరమాత్ర కర్మలు.

రెండు శరీరములను ఉపయోగించి చేయు కర్మలు కృష్ణ కర్మలు. కృష్ణమనగా అన్నిటిని చేయుట, అన్ని విధముల చేయుట. కృష్ణదేవుడుఅనగా, అన్ని విధముల నుపయోగించి అన్నిటిని సాధించినవాడు. కృష్ణ శబ్దమునకు కర్షతి, అనగా కష్టపడి పనిచేయుట (రెండు దేహములతో ఎక్కువ శ్రమ పడుట) అని అర్థము.

శుక్ల శబ్దమునకు గతౌ, ప్రవర్తించు అని అర్థము. మనస్సు దేనియందు ప్రవర్తించునో దాని పేరు శుక్లము. శుక్ల యజ్ఞమనగా మానసిక యజ్ఞమని అర్థము. కృష్ణ యజుర్వేద మన్త్రములు విపులముగా నుండి, యజ్ఞములను ఉత్సవప్రదముగా సేయుటకు వీలుగా నుండును. శుక్ల యజుర్వేద మన్త్రములు యాగశాలలయందు, యాగములు సేయుటకు ఉపయోగించినను, మన శరీరములోపల నున్న మానసిక యాగశాలకు కూడ పనికి వచ్చునట్లుండును.

స్వర్ణ ధర్మః స్వాహా
స్వర్ణ స్వర్ణార్కః స్వాహా
స్వర్ణ శుక్లః స్వాహా
స్వర్ణ జ్యోతిః స్వాహా
స్వర్ణ సూర్యః స్వాహా          శుక్ల యజుర్వేదము, (18–50)

ఇది శుక్లయజుర్వేద మన్త్రము. స్వర్ణమనగా బంగారము కాదు. వేదభాష ప్రథమభాష. తరువాత వచ్చిన సంస్కృత భాష శబ్దముల అర్థములు చెప్పరాదు. స్వర్ణమనగా బాగుగా ప్రకాశించునది. తనను కూడ స్వర్ణమయము జేయగలిగినది. స్వాహా శబ్దమునకు కూడ వేదమునందు అనేకార్థములున్నవి. నన్ను ప్రబోధించుగాక, అని ఇక్కడ అర్థము. స్వర్ణమయమయిన ధర్మము నాయందు ఫలించుగాక! అని తాత్పర్యము. ధర్మము అనగా, మనము చేయవలసిన కర్మ. వేదము మనకు లాభకరమని చెప్పిన కర్మ. యజ్ఞము అర్కమనగా స్తుతి, స్తోత్రము. ఋక్ శబ్దమునుండి అర్క శబ్దము వచ్చినది. వేదమన్త్రములు అని అర్థము. శుక్ల అనగా, తేజస్సు కలవాడు, అగ్ని[2]. జ్యోతిః తేజస్సు,

ప్రకాశము. సూర్యః సూర్యుడు, కాదు. మనము ఈ విశ్వమును చూచి అర్థము చేసికొనెడు శక్తి. సూర్య శక్తిని గురించి వేదమునందు అనేక మన్త్రములున్నవి. ఈ సూర్య శక్తిని అభివృద్ధి చేసుకొనుటకే యజ్ఞము. సూర్యశక్తి ఎంత పెరిగిన ఈ విశ్వము యొక్క యజ్ఞము మనకంత తెలియును. సంపూర్ణ విశ్వజ్ఞానమే బ్రహ్మము. యజ్ఞముల యొక్క పరమావధి మనము సంపూర్ణ జ్ఞానవంతులమగుట.

నేను చేయు యజ్ఞము నన్ను స్వర్ణమయుని సేయుగాక!
నేను చేయు దేవపూజ నన్ను స్వర్ణమయుని సేయుగాక!
నాయందున్న అగ్ని స్వర్ణమయమగుగాక!
నేను తేజోమయుడనగుదును గాక!
ఆ తేజస్సుతో విశ్వమునంతను తెలుసుకొనెదను గాక!

ఈ ఐదు మన్త్రములును యజ్ఞస్వరూపమును తెలియజెప్పుచున్నవి. అందున్న శబ్దములు అనేకార్థములను ఊహించుటకు అనువుగా నున్నవి. ధ్యానించుటకు, తపస్సు జేయుటకు వీలుగానున్నవి. ఆ తపస్సులో పుట్టిన భావము లు క్రొత్త సమిధలై లోనున్న అగ్నిని మరియు ప్రజ్వలింపజేయుటకు వీలుగానున్న మన్త్రములివి, అనగా మానసిక యజ్ఞ మునకు గూడ అనుకూలముగా నున్న మన్త్రములివి. మొదటి మన్త్రమునందు ధర్మ శబ్దము వాడి నిత్య జీవితమునందు మనమాచరించు ప్రతి పనిని, యజ్ఞమును సేయవచ్చునని కూడ వేదము చెప్పుచున్నది. ధర్మమయిన కర్మతో పూజించి న అగ్ని (శుక్రుడు) మనలో జ్యోతి స్వరూపుడై, మనకు సూర్యత్వమును ప్రసాదంచును. దానితో బ్రహ్మజ్ఞానము పొందుదుమని వేదము చెప్పుచున్నది. కృష్ణయజుర్వేద మన్త్రములు ఇంతకు మించి విపులములై యజ్ఞమునే గాక యజ్ఞ శాలలను యజ్ఞ పరికరములను కూడ తెలియజెప్పును. వాటి ప్రయోజనమును కూడ తెలియ జెప్పును. శుక్లయజుర్వేద మునకు సంబంధించిన ఇట్టి వివరములు శుక్లయజుర్వేద (సంహిత భాగమున గాక) బ్రాహ్మణ భాగమునందున్నవి. కృష్ణయజుర్వేద సంహితయందు బ్రాహ్మణము గూడ కలిసియున్నది. కృష్ణయజుర్వేద ప్రథమకాండ పంచమ ప్రశ్నలో 5, 6 అనువాకములు అగ్నిదేవతా ప్రార్థన మన్త్రములు. 7, 8 అనువాకములు ఆ మన్త్రములకు వ్యాఖ్యానమయిన బ్రాహ్మణము. మనలో నున్న యత్నము, లేక కర్మ యొక్క రెండు స్వరూపములను తెలియపరచుటకే యజు ర్వేదము శుక్ల, కృష్ణములుగా అవతరించినట్లు కన్పట్టుచున్నది.

మన జీవితమనిన మహా యజ్ఞమునందు అనేకమయిన క్రతువులను, యాగములను, సవనములను, ఇష్టులను చేయవలసి వచ్చును. చేసెదము. ఈ కర్మలలో వేటిని ఒక్క మనశ్శరీరముతోడనే చేయవలయునో, వేటికి మనశ్శరీరమ ుతోడ భౌతిక శరీరమును జోడింపవలెనో మన జ్ఞాన, భోగ, భాగ్య సంపాదనలో ఏది ఎప్పుడు ఎక్కువ ప్రయోజన కారియో తెలుసుకొనవలయునన్నచో ఈ రెండు వేదములు సంహిత, బ్రాహ్మణ ఆరణ్యకోపనిషత్తులనన్నియు జాగ్రత్తగా చదివిన కాని విశదము కాదు. ఈ పైన చెప్పినది వట్టి స్థూలమైన పరిశీలన.

ఇట్టి మహార్థవంతములైన శుక్ల, కృష్ణ శబ్దములకు పాశ్చాత్య పండితులు నలుపు, తెలుపు అనిన అర్థములను గ్రహించి తెల్లయజుర్వేదము, (White Yajurveda) నల్లయజుర్వేదము, (Black Yajurveda) అని వ్రాయుచున్నారు. మన భారతీయులు కూడ వారినే అనుసరించుచున్నారు.

స్వర్ణ ధర్మము కృష్ణ యజుర్వేదము
స్వర్ణార్కము శుక్ల యజుర్వేదము
స్వర్ణ శుక్రము ఋగ్వేదము
స్వర్ణ జ్యోతి సామవేదము
స్వర్ణ సూర్యము అథర్వ వేదము
మనము వాటి స్వర్ణత్వమును పొందుటకు ప్రయత్నింతుము గాక!

స్వర్ణ ధర్మః స్వాహా
స్వర్ణ స్వర్ణార్కః స్వాహా
స్వర్ణ శుకః స్వాహా
స్వర్ణ జ్యోతిః స్వాహా
స్వర్ణ సూర్యః స్వాహా – శుక్ల యజుర్వేదము, (18–50).

1. ఇషేత్వోర్జేత్వా....(ఓ దేవా) నిన్ను ఇష కొరకు, ఊర్జ కొరకు....
దేవో వః సవితా ప్రార్పయతు శ్రేష్ఠతమాయకర్మణ
(దేవతా శక్తి నన్ను శ్రేష్ఠమయిన కర్మ సేయుటకు ప్రేరణ కలుగజేయు గాక!)
ఆప్యాయధ్వమఘ్నియా దేవభాగమ్ (అఘ్నియా అనగా చంపరానివి, చంపకూడనివి,– పవిత్రములైన గోవులు: ఉత్తమాదర్శములు గల కోరికలు – ఓ గోవులారా, లేక ఓ కోరికలారా! దేవభాగమును వృద్ధి సేయుడు)
కృష్ణయజుర్వేదము (1–1–1).

ఆప్యాయధ్వమఘ్న్యా ఇన్ద్రాయ భాగమ్ (కోరికలారా, ఇన్ద్రభాగమును వృద్ధిసేయుడు)
శుక్ల యజుర్వేదము (1–1).

2. అగ్నికి అనేక శక్తులుండుటవలన, అనేకమైన నామములు. శుక్రుడు, వ్రతపతి, పావకుడు
..... మనకే శక్తి కావలసిన, ఆ శక్తిని సూచించు నామముతో ప్రార్థింతుము.